# భారీ క్లరికల్ నోటిఫికేషన్



## మొత్తం పోస్టులు 19243.. ఏపీ- 699, తెలంగాణ- 546.. మెయిన్‌లో టైమ్ లిమిట్

దేశంలోని జాతీయ బ్యాంకుల్లో క్లరికల్ పోస్టుల భర్తీకి ఐబీపీఎస్ భారీ ఎత్తున నోటిఫికేషన్ వెలువడింది. జాతీయ స్థాయిలో మొత్తం ఖాళీలు 19243 ఉండగా కేవలం తెలుగు రాష్ట్రాలకు సంబంధించి తెలంగాణలో 546 పోస్టులు, ఆంధ్రప్రదేశ్‌లో 699 పోస్టులు ఉన్నాయి. అయితే రెండు రాష్ట్రాల్లో 19 బ్యాంకుల్లో ఈ ఖాళీలు ఉన్నాయి. రిక్రూట్‌మెంట్ విధానంలోనూ ఐబీపీఎస్ కొద్ది పాటి మార్పులు చేసింది. ప్రిలిమినరీ, మెయిన్‌గా పరీక్షించే పద్ధతిని యథాతథంగా ఉంచింది. అయితే మెయిన్‌లో వివిధ టెస్టులకు ఇచ్చే సమయాన్ని ఉమ్మడిగా కాకుండా దేనికది విడిగా కేటాయించింది. నిర్దేశిత సమయంలోనే సబ్ టెస్ట్‌ను అభ్యర్థి పూర్తి చేయాలి. ఈ ఏడాది నోటిఫికేషన్‌లో కనిపించిన ప్రధాన మార్పు ఇది. అలాగే మెయిన్‌లో 200 మార్కులకు పేపర్ వివిధ టెస్టుల సమాహారంగా ఉంటుంది. దాన్ని 100 మార్కులకు లెక్కించి మెరిట్ జాబితాను రూపొందిస్తారు. వారికి రీజనల్ లాంగ్వేజ్‌లో కూడా టెస్ట్ నిర్వహించి ఆయా బ్యాంకులకు అలాట్ చేస్తారు. ఇంటర్వ్యూ మాత్రం ఉండదు. క్లరికల్ పోస్టులకు సంబంధించి ఇంటర్వ్యూ ఉండరాదన్న విధానాన్ని గత ఏడాది విడుదల చేసిన నోటిఫికేషన్ నుంచే అమలు చేస్తున్నారు. వివిధ జాతీయ బ్యాంకుల్లో వచ్చే ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఏర్పడే ఖాళీలన్నింటినీ ఈ నోటిఫికేషన్ కిందే భర్తీ చేయనున్నారు. ప్రతి రిజర్వుడు కేటగిరిలో కనీసం పది శాతం మందిని అదనంగా ఎంపిక చేసి అందుబాటులో ఉంచుతారు. అంటే 2018 మార్చి 31 వరకు ఏర్పడే ఖాళీలను ఈ నోటిఫికేషన్ కింద ఎంపిక య్యేవారితోనే భర్తీ చేస్తారు. ప్రభుత్వం నిర్దేశించే నిబంధనలకు లోబడి యావత్తు భర్తీ ప్రక్రియ ఉంటుంది.

మరొక ఆసక్తికరమైన అంశం ఏమిటంటే తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ కటాఫ్. గత ఏడాది నోటిఫికేషన్ ప్రకారం ప్రిలిమినరీ రాసిన వారిలో ఏపీలో 50.75 శాతం, తెలంగాణలో 31 శాతం మార్కులు పొందిన అభ్యర్థులు మెయిన్ ఎగ్జామ్‌కు అర్హత సాధించారు.

**అర్హత:** గుర్తింపు పొందిన సంస్థ నుంచి సెప్టెంబరు 12 నాటికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. కంప్యూటర్ మీద ఆపరేటింగ్ & వర్కింగ్ నాలెడ్జ్ ఉండాలి. అంటే కంప్యూటర్ ఆపరేషన్స్/ లాంగ్వేజ్ విభాగాల్లో సర్టిఫికెట్/ డిప్లొమా/ డిగ్రీ ఉండాలి. హైస్కూలు/ కాలేజ్/ యూనివర్సిటీ స్థాయిలో కంప్యూటర్ / ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఒక సబ్జెక్టుగా చదివి ఉండాలి. అభ్యర్థి ఎంచుకునే ప్రాంతానికి సంబంధించిన స్థానిక భాషలో ప్రావీణ్యం ఉండాలి.

**వయసు:** ఆగస్టు 1 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఎస్సీ/ఎస్టీలకు అయిదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూడీ అభ్యర్థులకు పదేళ్లు, విడోస్/ డైవోర్స్‌డ్ విమెన్‌కు తొమ్మిదేళ్ల సడలింపు ఇచ్చారు.

**దరఖాస్తు ఫీజు:** రూ.600 (ఎస్సీ/ ఎస్టీ/ పీడబ్ల్యూడీ/ ఎక్స్ సర్వీస్‌మెన్ అభ్యర్థులకు రూ.100 మాత్రమే)

**ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు:** దేశవ్యాప్తంగా అన్ని ప్రధాన నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. దీనికి సంబంధించిన పట్టికను వెబ్‌సైట్‌లో ఉంచిన నోటిఫికేషన్‌లో చూడవచ్చు.

తెలుగు రాష్ట్రాలకు సంబంధించి ప్రిలిమినరీ పరీక్ష కేద్రాల వివరాలు ఇలా ఉన్నాయి.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరీక్ష కేంద్రాలు:**

చీరాల, చిత్తూరు, గుంటూరు, హైదరాబాద్, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, పుత్తూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం, విజయనగరం

**తెలంగాణ రాష్ట్ర పరీక్ష కేంద్రాలు:**

హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్

### సిఎస్ఐఆర్ - యూజీసీ నెట్

కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్), యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి) సంయుక్తంగా నిర్వహించే నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (నెట్)ను డిసెంబర్ 18న హైదరాబాద్, గుంటూరు సహా పలు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. జూనియర్ లెక్చరర్‌షిప్/ లెక్చరర్‌షిప్‌నకు ఉద్దేశించిన టెస్ట్ ఇది. కెమికల్ సైన్సెస్, ఎర్త్, అట్మాస్ఫియరిక్, ఓషన్ అండ్ ప్లానెటరీ సైన్సెస్, లైఫ్ సైన్సెస్, మేథమెటికల్ సైన్సెస్, ఫిజికల్ సైన్సెస్‌లో ఈ టెస్ట్ జరుగుతుంది. ఫలితాలు వెలువడిన తరవాత రెండేళ్ల పాటు స్కోర్‌కు వ్యాలిడిటీ ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 9లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

వెబ్‌సైట్: www.csirh rdg.res.in

### ఖాళీల వివరాలు

| బ్యాంకులు | ఏపీ | తెలంగాణ |
|---|---|---|
| అలహాబాద్ బ్యాంక్ | 8 | 10 |
| ఆంధ్రా బ్యాంక్ | 194 | 119 |
| బ్యాంక్ ఆఫ్ బరోడా | 50 | 45 |
| బ్యాంక్ ఆఫ్ ఇండియా | 6 | 4 |
| బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర | 0 | 0 |
| కెనరా బ్యాంక్ | 170 | 150 |
| సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 58 | 44 |
| కార్పొరేషన్ బ్యాంక్ | 10 | 10 |
| దేనా బ్యాంక్ | 0 | 2 |
| ఇండియన్ బ్యాంక్ | నాట్ రిపోర్టెడ్ | నాట్ రిపోర్టెడ్ |
| ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ | 0 | 0 |
| ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్ | 15 | 15 |
| పంజాబ్& సింధ్ బ్యాంక్ | 1 | 3 |
| పంజాబ్ నేషనల్ బ్యాంక్ | 21 | 29 |
| సిండికేట్ బ్యాంక్ | 67 | 53 |
| యుకో బ్యాంక్ | 12 | 11 |
| యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 52 | 31 |
| యునైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా | 0 | 0 |
| విజయా బ్యాంక్ | 35 | 20 |
| **మొత్తం** | **699** | **546** |

### ఇండియన్ నేవీలో ఇంజనీర్లకు అవకాశాలు

ఇండియన్ నేవీలో ఇంజనీర్లకు సంబంధించిన ఉద్యోగ ప్రకటన వెలువడింది. వివిధ టెస్టుల అనంతరం ఎంపికైన అభ్యర్థులు షార్ట్ సర్వీస్ కమిషన్డ్ అధికారులుగా ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచుల్లో నియమితులవుతారు. నిర్దేశిత శారీరక, వయస్సుకు సంబంధించిన అర్హతలకు తోడు ఆయా బ్రాంచుల్లో బిఇ/ బిటెక్ ఉత్తీర్ణులు ఈ పోస్టులకు అర్హులు. ఒక్క ఐటీ విభాగానికి మాత్రం బీసీఏ/ ఎంసీఏ/ బీఎస్సీ(ఐటీ) ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిగ్రీలో సాధించిన మార్కులకు కటాఫ్ నిర్ణయించి షార్ట్ లిస్ట్ చేసిన అభ్యర్థులకు బెంగళూరు/ భోపాల్/ కోయంబత్తూర్/ విశాఖపట్టణంలో ఎస్ఎస్‌బి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. చివరగా మెడికల్ టెస్ట్ కూడా జరిపి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 16 లోపు దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.joinindiannavy.gov.in